

అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా భాగ్యలక్ష్మి



భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలుగా డి.భాగ్యలక్ష్మిని నియమించినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగిన సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో డి. భాగ్యలక్ష్మిని సిఐటియు నుంచి అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు సమక్షంలో నియమించడమైనది తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సిఐటియు కార్మిక ఉద్యోగ సమస్యలు, అంగన్వాడీ, ఆశా మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేసే నిజాయితీ, క్రమశిక్షణ గల సంఘమన్నారు. భవిష్యత్ సంఘం పటిష్టతకు సిఐటియు, విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే

- నిరసనలో కార్మిక, రైతు, వ్య.కా.సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

దేశంలో కార్పొరేట్ల కోసమే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్పించిన కార్మిక, రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నేతల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.విశ్వనాథ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి యం సాంబశివ, రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రంగారెడ్డి, కృష్ణప్ప మాట్లాడుతూ 2019లో వేతనకోడ్‌ను, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదం పొందించిందన్నారు. గత ఐదేళ్ల నుంచి వాటిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలలేదన్నారు. బీహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లేబర్ కోడ్స్ అమలు చేసే నాలుగు జిఒలను కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాన్‌సూక్ మాండవ్య ప్రకటించడం దారుణమన్నారు. ఈ లేబర్‌కోడ్‌లు కార్పొరేట్లకు అనుకూలంగా ఉండని తెలిపారు. 'క్రోని కాపిటలిజం' కాలంలో కార్పొరేట్లకు అత్యధిక లాభాలు గడించడానికి ప్రస్తుత చట్టాలు ఆటంకంగా ఉన్నాయన్నారు. ప్రస్తుత 29కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్‌లుగా కుదించి, అమల్లోకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి అనేక తరగతులను కార్మికులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. సామాజిక భద్రత, వృత్తిపర భద్రత కోడ్‌ల పేరుతో కార్మికులందరికీ భద్రత కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం పచ్చి మోసమని, బిల్డింగ్, మైన్స్, బీడీ కార్మికులు, జర్నలిస్టులతో సహ ఇప్పటికే పోరాడి సాధించుకున్న భద్రతను ఈ కోడ్‌ల కారణంగా కోల్పోతారని పేర్కొన్నారు. వచ్చే కాలంలో లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకుపోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి చెన్నయ్య, అక్బర్, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు ముబారక్, వేణుగోపాల్‌రెడ్డి, నర్సింహులు, తిరుమల, దేవా, చలపతినాయుడు, జానకి,రాధా కమ్యూనిస్టు నేతలు పాల్గొన్నారు. **మదనపల్లి అర్బన్ :** కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ అమలుకు ఇచ్చిన నోటిపై ఫైల్స్ తక్షణమే రద్దు చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి మోడీ ప్రభుత్వం అమలుకు నోటిఫై చేసిందని, ఈ కోడ్స్ తో కార్మికులకు లాభం కంటే నష్టమే ఎక్కువ ఉందన్నారు. ఇప్పటికే కార్మిక సంఘాలు, వాటికి మద్దతుగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయన్నారు. కార్పోరేట్ల ప్రయోజనాలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందనడానికి లేబర్ కోడ్స్ అమలే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అధికార తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపి కలిసి లేబర్ కోడ్స్ ను బలపరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 గంటల పని దినాన్ని 10 నుంచి 13 గంటలకు పెంచడం ద్వారా కార్మికులపై భారం పెరుగుతుందని, నిరుద్యోగం పెరుగుతుందని, లేబర్ కోడ్స్ తో యజమానులకు తప్ప, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, గోపాల్, కృష్ణప్ప, వెంకటరమణ, రైతు సంఘం నాయకులు రవీంద్రపాల్గొన్నారు. **రాజంపేట :** కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. లేబర్ కోడ్ల వ్యతిరేకంగా ఆర్ అండ్ బి బంగ్లా వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, అంగన్వాడీ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి లక్ష్మీదేవి, ప్రసాద్, ఎం.వి.రమణ, రెడ్డయ్య, రమేష్, అంగన్వాడీ నాయకురాలు అమరావతి, శివరంజని, మాధవి పాల్గొన్నారు.



రాయచోటి : నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు



రాజంపేట : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు



మదనపల్లి : సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వెలిగల్లు ఎత్తిపోతలకు కదలిక

- రూ.125 కోట్లతో ప్రతిపాదనలు
- 33 చెరువులకు జలకళ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు వెలిగల్లు ఎత్తిపోతల పనులకు కదలిక వచ్చింది. వైసిపి సర్కారు హయాంలో కాంట్రాక్టు బిల్లుల చెల్లింపుల ఆలస్యం నేపథ్యంలో రూ.100 కోట్ల విలువ కలిగిన వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. కూటమి సర్కారు ఎత్తిపోతల పథకం పనులపై దృష్టి సారించింది. సుమారు 12 కిలోమీటర్ల మేర మట్టి పనులు, పైపులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో తాజా ఎస్‌ఎస్‌ఆర్ రేట్ల ప్రకారం రూ.125 కోట్లతో కూడిన ప్రతి పాదనలు ప్రభుత్వానికి అందజేయనుంది. ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం వెలిగల్లు ఎత్తిపోతల పనులు చేపట్టడానికి కసరత్తు చేస్తోంది. వెలిగల్లు ఎత్తిపోతల పథకం కింద సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే అవకాశాలు ఉంది. రాయచోటి, గాలివీడు మండలాల పరిధిలోని 33 చెరువులు జలకళను సంతరించు కోనున్నాయి. రాయచోటి, గాలివీడు మండలాల పరిధిలోని చెరువులు నింపడం ద్వారా భూగర్భజలాలు పెరగడం ద్వారా సుమారు పది వేల మందికి తాగునీటి సదుపాయాన్ని అందించే అవకాశం ఉంది.



వెలిగల్లు ప్రాజెక్టు

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

- అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి
- మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి



మహిళా రైతుతో మాట్లాడుతున్న వైఎస్.జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కనీస మద్దతు ధర లభించక రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వానికి పట్టడం లేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అరటి పంట చెట్టు మీదనే మాగి కుళ్లిపోతున్నాయని తెలిపారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులను ఆదుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత బీమా లేదని చెప్పారు. ప్రభుత్వ తీరు మారకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బుధవారం పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను అడిగి పంట నష్టాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2024లో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని వాటిని ఆచరణలోనికి తీసుకురాక పోవడం దారుణమని పేర్కొన్నారు. 600 మెట్రిక్ టన్నుల స్టోరేజ్ చేసుకునే సామర్థ్యం ఉందన్నారు. ఎరువులు కూడా బ్లాక్‌లో కొనే పరిస్థితి రైతుకు వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో 16 సార్లు విపత్తులు వచ్చాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో 84 లక్షల మందికి ఉచిత పంట బీమా కట్టారన్నారు. ప్రస్తుతం 18 లక్షల మంది మాత్రమే బీమా కట్టుకున్నారని తెలిపారు. రైతులు వేసిన పంటలకు ఇ-క్రాప్ చేసే పరిస్థితి కూడా లేదన్నారు. పెట్టుబడి సాయం ప్రతి ఏటా రైతుకు అందించే వాళ్ళమని ఇప్పుడు అలా లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో అరటిపంటను అనంతపురం, తాడపత్రి నుంచి ఢిల్లీ, బొంబాయి తదితర రాష్ట్రాలకు 3 లక్షల టన్నులు ఎగుమతులు చేశామన్నారు. వైసిపి ప్రభుత్వంలో అరటి పంటకు టన్ను రూ.30 వేలు ఉండేదని ప్రస్తుతం రూ.2 వేలకు కూడా అడిగే వారు లేరన్నారు. దళారులతో ప్రభుత్వం కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా చేసిందని ఆరోపించారు. విద్యార్థులకు వసతి దీవెన, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఏవి అమలు చేయలేదన్నారు. కొత్త పెన్షన్లు ఇవ్వకపోవడమే కాకుండా ఐదు లక్షల పెన్షన్లను తొలగించారన్నారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మేస్తు న్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎవరు సంతోషంగా లేరని, త్వరలో ప్రజలు చంద్రబాబును గద్దె దింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.సతీష్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్‌చైర్మన్ హాఫీజ్, వైసిపి నాయకులు బలరాంరెడ్డి, కౌన్సిలర్లు రమణ, మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బిజీబిజీగా వైఎస్.జగన్

జగన్మోహన్‌రెడ్డి రెండవ రోజు పర్యటనలో భాగంగా బిజీ బిజీగా గడిపారు. పట్టణంలోని తన నివాసంలో 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనకు స్వేచ్ఛ, సమానతల కూడిన రాజ్యాంగాన్ని నిర్మించిన ఘనత అంబేద్కర్‌దేని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం లింగాల మాజీ సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వారి సమస్యలను తెలియజేశారు. ప్రతి ఒక్కరికి ఆప్యాయంగా పలకరించి వీటిని పరిష్కరించేలా చూడాలని ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డికి సూచించారు.



భూ పంపిణీ చేయాలని కోరుతున్న ఉప్పరవాండ్లపల్లె గ్రామస్తులు

అర్హులకు భూ పంపిణీ చేయాలి

- ఉప్పరవాండ్లపల్లె గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం చేపడుతున్న భూ పంపిణీ కార్యక్రమంలో తమకు భూములు కేటాయించి ఆదుకోవాలని పిటిఎం మండలం, ఉప్పర వాండ్లపల్లె గ్రామస్తులు కోరుతున్నారు.బుధవారం వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వెంకటాచలపతి, రమాదేవి, నాగ రాజు, శివమ్మ, వెంకటరమణప్ప, రాజన్న, లక్ష్మమ్మ, కాంతమ్మ సబ్ కలెక్టర్ కార్యా లయం వద్ద చేరుకొని అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సం ఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉప్పరవాండ్లపలి ్లలో సుమారు 50కుటుంబాలు వారు జీవనం చేస్తున్నారన్నారు. వీరం దరికి ఒక్క సెంటు భూమికూడా లేకపోవడంతో వ్యవసాయ కూలీలుగానే మిగిలిపోయి జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో జరిగిన భూ పంపిణీ కార్యక్రమంలో పలుమార్లు అర్జీలు ఇచ్చినా నిరాశే ఎదురైంది తప్ప భూ పం పిణీ జరగలే దన్నారు. ఈసారైనా కూటమి ప్రభుత్వం వీళ్లను గుర్తించి, దరఖాస్తులను తీసుకుని విచారించి అర్హులైన వీరికి భూ పంపిణీ చేయాలని కోరారు.

ఎపిఐఐసి డైరెక్టర్‌గా భాస్కర్‌రెడ్డి ప్రమాణం

ప్రజాశక్తి-రాయచోటి

ఎపిఐఐసి డైరెక్టర్‌గా రాయచోటి మండలానికి చెందిన టిడిపి నాయకుడు కొండా భాస్కర్‌రెడ్డి బుధ వారం మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లో ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పైన నమ్మకంతో తనకు ఎపిఐఐసి డైరెక్టర్ గా అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

ఖైదీల్లో సత్ప్రవర్తనకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రిమాండ్ ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా జైళ్ళ అధికారి రవిబాబు అన్నారు. బుధవారం మదనపల్లెలోని స్పెషల్ సబ్ జైలునుఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాటాడుతూ అడ్మినిస్ట్రేషన్‌ను మెరుగుపరచి ఖైదీలకు ప్రభుత్వం అందించే సదుపాయాలు కల్పిస్తామన్నారు. జైలు సూపరింటెండెంట్ లక్ష్మణరావుతో కలిసి జైలర్ల క్వాటర్స్, జైలు ప్రహరీ, రక్షణ ఫెన్సింగ్, సిసి కెమెరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. బేరక్‌లోని ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.



సబ్ జైలును తనిఖీ చేస్తున్న జైళ్ల అధికారి రవిబాబు

30లోపు 'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు అందరూ ఈ నెల 30వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డిఇఒ కె.సుబ్రహ్మణ్యం బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో విద్యార్థి తనకు సంబంధించిన పుట్టిన తేదీ, ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లు తదితర వివరాలన్నీ స్పష్టంగా సరిచూసుకొని ఫీజు చెల్లించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అపార్ ఐడి పూర్తికాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల పిలిపించుకొని విద్యార్థి ఆధార్ కార్డు, అడ్మిషన్ రిజిస్టర్ ను పరిశీలించి వారికి ఏ వివరములు కావలెను తెలుసుకొని ఒక అఫిడవిట్ తీసుకొని ఆ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కొంతమంది విద్యార్థులు పాఠశాలకు అసలు హాజరు కాకపోవడం వల్ల వారి పుట్టుమచ్చలు గాని, ఫోటోలు కానీ సేకరించలేని పక్షంలో కనీసం వాళ్ళ తల్లిదండ్రులను సంప్రదించి వారి స్థితిగతులు తెలుసుకొని పాఠశాలకు రాలేని పక్షంలో వారి దగ్గర ఒక లెటర్ తీసుకోవాలన్నారు. 30వ తేదీ వరకు రాకుంటే వారిని డ్రాప్‌బాక్స్‌లో చేర్చవలెనుని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చివరి తేదీ వరకు చూడకుండా వీలైనంత త్వరగా విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ : 2026 మార్చిలో జరగబోయే పరీక్షలకు ఫీజు చెల్లింపులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి డిఇఒ కార్యాలయంలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కె శ్రీనివాసరాజు తెలిపారు. కార్యాలయం నందలి ఈ సెల్‌కు ప్రధానోపాధ్యాయులుగానీ, విద్యార్థులు గాని కాల్ చేసి వారి సమస్యలకు పరిష్కారం కనుగొనాలన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ

జపాన్‌లో పర్యటించిన 'మిట్స్' విద్యార్థులు



జపాన్ ప్రతినిధులతో మిట్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బియూనివర్సిటీకి చెందిన బి.టెక్ చివరి సంవత్సర విద్యార్థుల బృందం జపాన్‌లో ఉన్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇచినోసేకి కళాశాలను సందర్శించింది. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్-2025'లో భాగంగా ఈ పర్యటన జరిగిందని వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. విద్యార్థుల బృందాన్ని డాక్టర్ వంశీ బండి నేతృత్వం వహించగా, సి. చెర్షితా రెడ్డి, కే.హేమ చరిత, అనికేత్ అరుణ్ సస్మాల్, ఎలోకేష్, కె.తేజశ్రీ, ఎస్.వైష్ణవి, ఎం.తేజేశ్వర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులు కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రిక్ అటానమస్ వెహికల్స్ ఇంటర్నేషనల్ కో-క్రియేషన్ ప్రాజెక్ట్, రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, కంప్యూటర్ ఆర్కిటెక్చర్ ల్యాబ్ వంటి అనేక ఆధునిక సాంకేతిక రంగాలలో అనుభవాత్మక శిక్షణ పొందినట్లు ఆయన తెలిపారు. మిట్స్, అంతర్జాతీయ విద్యాసంస్థల మధ్య పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక సహకారానికి ఈ పర్యటన నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇచినోసేకి కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ జన్య కొబయాషి నేతృత్వంలో జరిగిన అవగాహన ఒప్పందం చర్చలు ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. జపాన్ పర్యటన విజయవంతం చేసిన విద్యార్థుల బృందాన్ని, డాక్టర్ వంశీ బండిని యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డాక్టర్ శ్రీమంత బసు, సీనియర్ మేనేజర్ యు.విజయలక్ష్మి, అధ్యాపక వర్గం అభినందించారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో మొక్కలు విరివిగా పెంచడమే శ్రేయస్కరమని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆస్పత్రి ఆవరణంలో ఆయన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే కాలుష్యాన్ని దూరం చేయడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనితెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ మహమ్మద్, వైద్యులు కోటేశ్వరి, డాక్టర్.శివ, స్టాఫ్ నర్సులు,సిబ్బందితో పాటు అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, ఖాదర్ బాషా బుజ్జిబాబు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్య సిబ్బంది

ఉపాధి కల్పన కోసం కృషి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కొత్త జిల్లాలు, డివిజన్ల సరిహద్దులపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులపై జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి 3 కొత్త జిల్లాలకు ఆమోదం తెలపడం పట్ల సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మదనపల్లె జిల్లా కోసం ఉద్యమాలు చేసిన వివిధ ప్రజా సంఘాలకు అభినందనలు తెలిపారు. జిల్లా ఏర్పడటం ఖాయమని భావించిన అధికార పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాలు సంబరాలు చేయడం బాగానే ఉన్నా, శ్రమ జీవుల జీవితాల్లో వెలుగులు తీసుకురాలేదనే విషయం గమనంలో ఉంచుకోవాలని అన్నారు. కొత్తగా ఏర్పడబోయే మదనపల్లె జిల్లాలో ఉపాధి కల్పించే పరిశ్రమలు గానీ, ఆదాయ వనరులు కానీ లేవన్నారు. మెరుగైన విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండి, జిల్లా కేంద్రం అయినంత మాత్రాన సామాన్య ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం పోరాటాలకు ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మదనపల్లెలేని జిల్లాను ఊహించలేం : వైసిపి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మదనపల్లె ప్రాంతం లేని అన్నమయ్య జిల్లాను ఊ హించడానికే బాధగా ఉందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.వైసిపికి కంచుకోటలా ఉన్న రాయచోటి ప్రజలపై కూటమి పాలకులు రాజకీయ ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తుండడం దారుణమన్నారు. రెండేళ్ల క్రితమే రాయచోటిలో జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి అప్పటి వైసిపి ప్రభుత్వం రూ.100కోట్లు నిధుల విడుదలకు అనుమతులు మంజూరు చేసినప్పటికీ, నేటికీ కూటమి ప్రభుత్వం ఒకరూపాయి కూడా మంజూరు చేయక పోవడం దుర్మార్గమన్నారు. నాలుగేళ్ల క్రితం ఏర్పాటైన అన్నమయ్య జిల్లాను మరోమారు అన్యాయంగా విభజించాలని చూస్తుండడం తగదన్నారు. వైసిపి హయాంలో 13 జిల్లాలను పారదర్శకంగా 26 జిల్లాలుగా విభజిస్తే ప్రతిపక్ష పార్టీల నేతలు జిల్లాల విభజన అడ్డగోలుగా చేశారంటూ గగ్గోలు పెట్టారన్నారు. ఎన్నికల సమయంలో హిందూపురంను జిల్లా కేంద్రం చేస్తామని హామీనిచ్చారని, మరి ఇప్పుడు సత్యసాయిజిల్లాను ఎందుకు విభజించడం లేదంటూ ప్రశ్నించారు. ఇప్ప టికైనా కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లాను యథాతథగా ఉంచాలంటూ డిమాండ్ చేశారు. కొందరు రాజకీయ విమర్శలు చేస్తూ నోటికేది వస్తే అది మాట్లాడడం సరైనది కాదన్నారు. అనవసర మైన విమర్శలు మానుకుని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.

జిల్లాను యథాతథంగా కొనసాగించాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లాను విభజించకుండా యథాతథంగా కొనసాగించాలని జిల్లా సాధన కమిటీ సభ్యులు, వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాను విభజించి మదనపల్లి కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేయాలని చూడడం ప్రభుత్వానికి తగదన్నారు. జిల్లా విభజన రాయచోటి ప్రాంతీయుల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తున్నప్పటికీ మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు ప్రాంతాలను విభజి స్తుండడం జిల్లా నుంచి మూడు స్తంభాలను తొలగిం చడమేనన్నారు. రాయచోటి, రాజంపేట, కోడూరు ప్రాంతాలు కరువు పీడిత ప్రాంతాలని అన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధి చెందాలంటే అన్నమయ్య జిల్లాను విభజించ కుండా యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు అన్నమయ్య జిల్లాను విభజించబోమని, యథాత థంగా కొనసాగిస్తామంటూ ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.



మాట్లాడుతున్న మహమ్మద్‌ఖాన్



కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కలికిరి

కుష్టువ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పారామెడికల్ అధికారి రవికుమార్ తెలిపారు. మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో కుష్టువ్యాధి నిర్ధారణ కార్యక్రమం జరుగుతున్నటువంటి విధానాన్ని క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలకు ఇంటింటి సర్వే విషయమై పలు సూచనలు చేశారు. ప్రతి వ్యక్తిని తప్పకుండా పరీక్ష చేయాలని, కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలున్న వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు పంపించి పరీక్ష చేయించి కుష్టు వ్యాధి నిర్ధారణ చేయించాలన్నారు. కుష్టు వ్యాధి ప్రాథమిక దశలో గుర్తించడం వలన అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునని, ఈ కుష్టు వ్యాధి బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ బహుళ ఔషధ చికిత్స ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుంచి 30వరకు జరుగు తుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్య క్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కావ్య గంధ, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, పర్యవేక్షణ అధికారి సుధాకర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలని ఫార్మర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్‌రాజు తెలిపారు. బుధవారం వీరబల్లిలో తన స్వగృహంలో ఆయన మాట్లాడుతూ వీరబల్లి, సుందుపల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, సంబేపల్లి, చిన్నమండెం మండలాల ప్రజలకు సాగునీరు తాగునీరు అందించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్నందున ఆ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా రాయచోటి వాటా ఎనకబడి ఉందన్నారు. రాయచోటి సమీపంలోని వెలుగల్లు ప్రాజెక్టు పూర్తై అయ్యి 20 సంవత్సరాలు అయినా కాలువలకు సిమెంటు, లైనింగ్, పూర్తిగా లేకపోవడంతో ఆయకట్టు నీటి సౌకర్యం అంతంత మాత్రమేనన్నారు. ఝరికోన ప్రాజెక్టు పూర్తయి 15 ఏళ్ళు పూర్తయినా ఇంతవరకు కాలువలు లేవన్నారు. ఎన్.టి.రామారావు ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, ప్రాజెక్టులు 1986 సంవత్సరం నుంచి పూర్తి కాలేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన ప్రాజెక్టులను పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. కొన్ని జిల్లాల్లో వర్షాల ఎక్కువై వరదలు వస్తుంటే, ఈ ప్రాంతంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సాగునీరు , తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేసి, ప్రజలకు తాగునీరు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

మాక్ అసెంబ్లీలో రాచవేటివారిపల్లె విద్యార్థి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె




పార్థసారథి

అమరావతిలో బుధవారం జరిగిన స్టూడెంట్స్ మాక్ అసెంబ్లీ నందు నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె జడ్‌పి హైస్కూల్ విద్యార్థి పాల్గొన్నట్లు ఎంఇఒలు పద్మావతి, నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాజకీయ పరిపక్వత, అసెంబ్లీ నిర్వహణపై అవగాహన కల్పించడానికి సంకల్పంగా ఆలోచించి మాక్ అసెంబ్లీ బుధవారం అమరావతిలో నిర్వహించిందన్నారు. మండలంలోని రాచవేటి వారిపల్లె జడ్‌పి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.పార్థసారథి చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహరించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన మండల నియోజకవర్గ పోటీలలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి మాక్ అసెంబ్లీకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా పార్థసారథిని హెచ్ఎం జయ రామిరెడ్డి, ఉపాధ్యాయబృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

జ్వరంతో మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రెండు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ, నెమలినగర్ ఒడ్డిపల్లెకి చెందిన వెంకటరమణ భార్య గోవిందమ్మ(61) గత రెండు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.



భూమి ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

కళాశాల భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 6.01 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని కళాశాల సిబ్బంది తహశీల్దార్ హరికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో 49.18 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని, అందులో 7ఎకరాలు కలికిరిలోని సైనిక్ స్కూల్‌కు, ఇటీవల 4.46 ఎకరాలను ఎన్ హెచ్ -71 కు కేటాయించబడ్డాయని తెలిపారు. ఇందులోని సర్వే నంబర్ 598లో ఒక వ్యక్తి 6.01 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఆక్రమణకు పాల్పడ్డాడని, వెంటనే కలికిరిలోని ఉద్యాన పాలిటెక్నిక్ సిబ్బంది ఆక్రమణ స్థలాన్ని సందర్శించి, ఆక్రమణను ఆపారని చెప్పారు. ఇదే విషయాన్ని తహశీల్దార్‌కు తెలియజేశామని తెలిపారు. మండల సర్వేయర్ ఉద్యాన పాలిటెక్నిక్ భూమి సర్వే చేసి సరిహద్దులు సూచించారని, వివాదాస్పద భూమికి ఎల్‌పిఎం 502 ఎలా ఇవ్వబడిందని, పైన పేర్కొన్న ఎల్‌పిఎం కలికిరి లోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ పేరుతో నమోదు చేయబడిందని, అందువల్ల అక్రమ ఎల్‌పిఎం రద్దు చేసి, ఆక్రమణదారులపై భూ కబ్జా చట్టం కింద అవసరమైన చర్య తీసుకోని, కాలేజీ స్థలాన్ని రక్షించాలని కోరినట్లు వారు తెలిపారు.

నిరుపేదలకు పక్కా గృహాలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి



గ్రామస్తులతో మాట్లాడుతున్న షఫీనాయక్

నిరుపేదలు పక్కా గృహాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చుని లక్కిరె డ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ షఫీ నాయక్ పేర్కొన్నారు. రెడ్డివారిపల్లి లక్కిరె డ్డిపల్లి గ్రామాలలో హౌసింగ్ అధికా రులచే ఆయన పర్యటించి నిరుపే దలను గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయించాలని అధికారులు కోరారు. ప్రతి నిరుపేద ఇల్లుకు దరఖాస్తు చేసుకునే ప్రభుత్వం తక్షణమే మం జూరు చేస్తుందని ప్రతినిధి కార్యక్రమంలో, డిజిటల్ అసిస్టెంట్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

బలమైన ప్రజాస్వామ్యానికి పునాది రాజ్యాంగం : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

బలమైన ప్రజాస్వామానికి పునాది భారత రాజ్యాంగమని జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు జ్యోతి ప్రజ్వలన చేసి,పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ 1949 నవంబర్ 26న ప్రజల అందరి తరపున రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని, అందువల్లనే నవంబర్ 26 ను దేశ ప్రజలందరూ రాజ్యాంగ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు రాజ్యాంగాన్ని రచించడానికి బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి, మన దేశంలోని సాంస్కృతిక, భాషల, తదితర వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామని తెలిపారు. నవంబర్ 26, 1949 న భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజని తెలిపారు.కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదనరావు, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తులు, వ్యవస్థలు రాజ్యాంగానికి లోబడాలి

దేశ ప్రజలు అందరూ గౌరవంగా జీవించడా నికి వ్యక్తులు వ్యవస్థలు భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం ఉందని భారత్ న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల కమిటీ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగాసాయంత్రం భారత న్యాయవాదుల సంఘం కార్యాలయంలో న్యాయవాదుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఐఎఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. ఆనంద్ కుమార్ భారత న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి ఖాదర్బాషా, డి నాగ ముని, హుమ యూన్, ఎం నాగేశ్వరరావు, వరలక్ష్మి, టీవీ రమణ, న్యాయవాదులు పాల్గొన్నారు.**రాయచోటి అర్బన్:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపిడిఒ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటాలకు పరిపూర్ణ అరుంధతి ఉద్యోగులతో కలిసి పూలమాలలు వేసి ఘనం గా నివాళుల ర్పించారు. **కలకడ:** రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు, ఉర్దూ) ఆదర్శ పాఠశాల, కదిరాయి చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలం లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, విద్యార్థులు, పాల్గొన్నారు.**నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఆరవపల్లిలో ఉన్నటువంటి గ్రంథాలయంలో భారత దేశ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ సూర్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి, రవిశంకర్ రాజు, రిటైర్డ్ డిటి జయన్న, మంటిమారయ్య, రవీంద్రరాజు, చలపతి, నాగరాజు, మాచుపల్లి రవికుమార్ గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.**కలికిరి:** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కలికిరి అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు రాష్ట్ర



అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

అధికార ప్రతినిధి హరి, తాసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హరికుమార్, సిబ్బంది ఆధ్వర్యంలో బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.**రాజంపేట :** పౌరులలో రాజ్యాంగ విలువలను ప్రోత్సహించడానికే ప్రతి సంవత్సరం నవంబర్ 26న మన దేశంలో 'సంవిధాన్ దివస్' అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు, సాంఘిక ఉపాధ్యాయులు మొలక ఓబులేసు అన్నారు. మండల పరిధిలోని కొత్త బోయినపల్లి పి.యం.శ్రీ ఎస్. జె ఎస్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పోలిచెల్ల గోపాలరావు, ఉపాధ్యాయులు పుత్త జనార్ధన్, పారా శ్రీరాములు, బి.శేషగిరి, ప్రభాకర్ రావు, ఎస్వీ రామరాజు, అనిల్ కుమార్, యన్.రాజయ్య, అమరావతి, సువర్ణ సుందరి, మధురవాణి, దార్ల శ్రీనివాసులు ఆచారి, ప్రశాంత్ పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :**మనం భారతరాజ్యాంగాన్ని రక్షించుకుంటే, రాజ్యాంగం మనల్ని రక్షిస్తుందని, రాజ్యాంగ దినోత్సవం లో భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద, బాస్, విసికెసంయుక్తంగా వేడుకలు నిర్వహించాయి. కార్యక్రమంలో బాస్ అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, కోశాధికారి నీరుగట్టి రమణ, బాస్, విసికె నాయకులు మంచూరి మారెప్ప, జి.గంగులప్ప, గంగాధర్, బండకోట రవి, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.**గుర్రంకొండ :** మండలంలోని టి.రాజు పల్లెలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్ బాబు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.**చిట్వేలి :**స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రాజ్యాంగ దినోత్సవం సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా పాఠశాలలో కొత్తగా నియమితులైన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, విశ్వనాథం, నవీన్ కుమార్, సుహాసిని,ప్రవీణ్ కుమార్, మధు, అనూష, నాగమల్లేశ్వరమ్మ, సుభాష్ చంద్రబోస్, పాల్గొన్నారు.


మదనపల్లె జిల్లా ఏర్పాటు హర్షణీయం : సాధన సమితి



మదనపల్లి:ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మదనపల్లె జిల్లా సాధన సమితి సభ్యులు స్థానిక బిటికళాశాలలోని ఠాగూర్ కాటేజీ వద్ద సంబరాలు చేసుకున్నారు. మదనపల్లెలో జాతీయగీతాన్ని అనువాదం చేసి, స్వరపరిచి దేశానికి అందించిన, విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ విగ్రహానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయగీతం ఆలపించి, జెండా వందనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ 116ఏళ్ల మదనపల్లె జిల్లా కల సాకారం కావడంతో, మదనపల్లె ప్రజలు ఎంతో ఆనందోత్సాహంలో మునిగి తెలుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. మదనపల్లె జిల్లా కోసం చేపట్టిన 633 రోజుల ప్రజా ఉద్యమాన్ని, జిల్లా కలెక్టం కు సమర్పించిన 2,826 వినతిపత్రాలను జగన్ ప్రభుత్వం అవమానించిందని, జిల్లా ఉద్యమాన్ని అణచివేసేందుకు అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు జగన్మోహనరెడ్డి అహంకారానికి చెంపపెట్టు లాంటిదని చెప్పారు. త్వరలోనే జిల్లా సాధన ఉద్యమ ప్రతినిధులతో చర్చించి, థాంక్యూ సీఎం పేరుతో కృతజ్ఞతా సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి సభ్యులు ముత్యాల మోహన్, రాయల్ సూరీ, క్రాంతి, బండకోట రవి, శ్రీనివాసులు, జీవీ రమణ, దేగాని రమణ, వై. గంగాధర్, ఎస్. రెడ్డెప్ప, రవిశంకర్, శశిధర్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :**మదనపల్లె జిల్లా సాధన కోసం ప్రజలు చేసిన నిరంతర పోరాటాలు, సిఎం చంద్రబాబు ఆశీస్సులతో మదనపల్లె జిల్లా ఏర్పాటవుతుందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరత్నం, టిడిపి మండలాధ్యక్షులు వెంకటరమణ, మాజీ మండలాధ్యక్షులు రాజన్న అన్నారు. **కలికిరి:** మదనపల్లెని జిల్లాగా, పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ప్రకటించడంపై కలికిరి సింగిల్ విండో కార్యాలయం వద్ద టిడిపి మండల అధ్యక్షుడు కెఎస్ షాబుద్దీన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి, బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సింగిల్ విండో చైర్మన్ నల్లారి చంద్ర కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, రెడ్డివారి యోగేష్‌రెడ్డి, కేక్‌ను నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు.



కలికిరి: కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాలి : డిఇఒ



మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందింపజేసి ఆవిష్కరణల రూపకర్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణం మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమైన ఆటలు టింకరింగ్ పాఠశాలల మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులలోని నైపుణ్యాలను పెంపొందింప చేయడానికి ఉద్దేశించి ఆటల్ టింకరింగ్ ల్యాబ్‌లను స్థాపించారని చెప్పారు. ఈ ప్రయోగశాలలోని పరికరాలను సక్రమంగా ఉపయోగిస్తే విద్యార్థులలో నైపుణ్య అభివృద్ధి జరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులు విభిన్న ఆలోచనలను కలిగి ఉండి నూతన ఆవిష్కరణలను రూపొందిస్తారని అన్నారు. జిల్లాలోని 24 ప్రభుత్వ యాజమాన్య అటల్ టింకరింగ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఇన్‌ఛార్జి టీచర్లకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వారి చేతనే ప్రాజెక్టులను రూపొందింప చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా రిసోర్స్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, సర్ఫుద్దీన్, హేమంత్, వెంకటేశ్వర్లు, మనోహర్, అజయ్,సాయి,అటల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పంచ సూత్రాలు లాభదాయకం

ప్రజాశక్తి-గుర్రంకొండ

రైతులకు పంచ సూత్రాలతో ఎంతో లాభదాయకంగా ఉంటుందని డిపిఎం వెంకట్ మోహన్, జెడిఎ శివనారాయణ మండలంలోని నడిమిక పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతన్న మీకోసం పంచసూత్రాలు రైతులకు తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతులకు జెడిఎ చేతుల మీదుగా సీడ్ కిట్స్ పంపిణీ చేశారు. మామిడి రైతులు , కూరగాయల రైతులతో మార్కెటింగ్ అవకాశాలు, ధరలు, సప్లై చైన్ మరియు ప్రత్యక్ష విక్రయ విధానాలు వంటి అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. రైతులు మార్కె టింగ్ లో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు గుర్తించి తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు**. రాజంపేట :**కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందని జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు తెలిపారు. జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు సూచనల మేరకు ఊటుకూరు పంచాయతీలో 'రైతన్నా..మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు అబూ బకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచుతూ పథకాల గురించి రైతులకు వివరించారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో రైతును రాజు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన నీటి భద్రతా కార్యక్రమాలు, డిమాండ్ ఆధారిత పంటల ప్రోత్సాహం, శాటిలైట్ టెక్నాలజీ ద్వారా పంటల పర్యవేక్షణ, అలాగే రైతులకు అందుతున్న వివిధ మద్దతు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిరీష, రాజేశ్వరి, పద్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ -అచ్యుత్ సాయి,స్థానిక నాయకులు పెడకాల సుధాకర్, లక్ష్మీపతి రాజు పాల్గొన్నారు. **నందలూరు** మండలంలోని అడపూరు గ్రామంలోని జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ ఎస్ భావన పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేసిన ఐదు ప్రధాన సూత్రాలను నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుబ్బయ్య గారు , సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని కన్నెమడుగు గ్రామంలో నిర్వహించారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకే తిక పద్ధతులు మీద రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఎడి డాక్టర్ సుమిత్ర, మండల పశు వైద్యాధికారి డాక్టర్ విక్రమ్‌రెడ్డి,వ్యవసాయ సహాయకులు నవ్య, భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



గుర్రంకొండ : రైతులతోకలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డిపిఎం, డిఎఒ



మాట్లాడుతున్న ఓబులేసు

ఎన్‌జిఒ కార్యదర్శిగా జయసూర్య

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు తాలూకా ఎన్‌జిఒ సంఘం కార్యదర్శిగా జయసూర్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి కడప జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు బి.శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎపి ఎన్‌జిఒ కార్యాలయంలో తాలూకా అధ్యక్షులు పోలిచర్ల ఓబులేసు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా అడహ కమిటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. రైల్వేకోడూరు ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న రవివర్మ పదోన్నతపై కడపకు వెళ్లడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యదర్శిగా రవీంద్రవర్మ స్థానంలో జయసూర్యను, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ మనోజ్ చంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్‌జిఒ అధ్యక్షులు ఓబులేసు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు తాలూకా అసోసియేషన్ సభ్యులు రవిశంకర్,వైస్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, ప్రముఖ వైద్యులు దేవేందర్‌రెడ్డి, యశోద, సంయుక్త కార్యదర్శులు సురేష్, కలూద,మొదలగువారు మరియు సభ్యులు పాల్గొన్నారు.

గుండయ్యనాయుడు మృతి తీరని లోటు

ప్రజాశక్తి-చిట్వేలి : టిడిపి సీనియర్‌నాయకులు కందుల గుండయ్యనాయుడు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర ఖాది అండ్ విలేజ్ ఇండస్ట్రీ చైర్మన్ కెకె.చౌదరి అన్నారు. గుండయ్య నాయుడు మృతదేహానికి పార్టీ జెండా, పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా టిడిపి జెండాను మోస్తూ మాలాంటి వాళ్లలో ఉత్సాహాన్ని నింపుతూ ఆదర్శంగా నిలిచా రని కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా ఆమ్‌ఆద్మీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం స్థానిక సర్వజన బోధనాస్పత్రి ఎదుట మదనపల్లి నియోజకవర్గం కన్వీనర్ సయ్యద్ రహీమ్, జిల్లా ఇన్‌ఛార్జి శశికుమార్‌చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆవిర్భవించిన రోజునే ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించి దేశంలోనే చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టిందన్నారు.విద్యా, వైద్యం పేద మధ్య తరగతి ప్రజల్లో వెలుగులు నింపుతూ ప్రజా సమస్యలపై ప్రజాధనాన్ని ఖర్చు చేసి ప్రజాస్వామ్య పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో ఎపి ఎరుకుల డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూజారి రెడ్డి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలా వెంకటరమణ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలరాజుకు అభినందనలు

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సంఘరాజు బాలరాజును పుల్లంపేట టిడిపి నాయకులు సంపూర్ణ సౌభాగ్యవతి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ సంగరాజు బాలరాజు వైద్య వృత్తిలో ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపిక కావడంతో సంతోషకమని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో ఆయన సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు.

క్రైం కార్నర్



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

-కారును ఢీకొన్న కంటైనర్ : ఇద్దరు దుర్మణం

- రెండు కుటుంబాలలో నెలకొన్న విషాదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/ ముకలకలచెరువు



వెంకటరమణ(ఫైల్‌ఫొటో) రాజశేఖర్(ఫైల్ ఫొటో)

చెన్నై-ముంబై జాతీయ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెం దారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ములకలచెరువు పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సప్తగిరినగర్‌లో నివాసం ఉంటు న్న రిటైర్డ్ ఆర్‌టిసి కండక్టర్ వెంకటరమణ(65) నీరుగ ట్టువారిపల్లిలో నివాస ముంటున్న రాజశేఖర్(40) దగ్గరి బంధువులు. అనం తపు రం మండలం, సావి రెడ్డివారిపల్లిలో జరుగుతున్న బంధువుల వివా హానికి వెంకటరమణ, రాజశేఖర్ మంగళవారం రాత్రి మారుతి కారులో బయలుదేరి వెళ్లారు. బుధవారం ఉదయం వివాహమనంతరం తిరిగి అదే కారులో స్వగ్రామానికి బయలు దేరారు. మార్గ మధ్యంలోని వేపూరికోట, బురకా యలకోట మధ్యలో వీరి కారును అనం తపురం వైపు వెళుతున్న కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు కాగా అందులో ఉన్న వెంకట రమణ, రాజశేఖర్ సంఘటనా స్థలంలోని మృతి చెం దారు. సమాచారం అందుకున్న మొలకలచెరువు పోలీసులు సంఘ టనా స్థలా నికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రిటైర్డ్ కండక్టర్ వెంకట రమ ణకు భార్య ఇందిరమ్మ, కుమారుడు నవీన్ కుమార్, హరిత లు ఉన్నారు. మరో మృతుడు రాజశేఖర్‌కు భార్య రాధ, కుమార్తె వైష్ణవి, కుమారుడు కార్తీక్ ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన వెంకటరమణ, రాజశేఖర్ కుటుంబాల్లో విషాదం నెలకొంది. తమ కుటుంబ పెద్దలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని వార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. వీరిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం మదన పల్లిలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పొన్నేటిపాళ్యం గ్రామం, ఎగువ కురువంకలో ఉంటున్న మునిరాజా(45) కుటుంబ కలహాలతో విసిగి వేసారిపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.